



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి


ఎల్‌ఆర్‌ఎస్‌కు మరో అవకాశం

కరీంనగర్ కార్పొరేషన్‌లో 26వేల దరఖాస్తుల పెండింగ్

- త్వరలో పరిశీలన
- మూడు నెలల్లో క్రమబద్ధీకరణకు ఆదేశాలు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 2: అక్రమ లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మూడు నెలల్లో దరఖాస్తులను పరిశీలించి వాటిని క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. త్వరలోనే పెండింగ్ దరఖాస్తులను పరిశీలన చేయాలని, ఈ ప్రక్రియకు సంబంధించిన మార్గదర్శకాలను రాష్ట్ర పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి ఎం.దానకిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనితో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మరో అవకాశం లభించింది. 2020 ఆనాటి ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌కు నామమాత్రంగా వేయి రూపాయలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో కరీంనగర్ నగరపాలక సంస్థకు 26వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. ఎల్‌ఆర్‌ఎస్, బీఆర్‌ఎస్‌పై కొందరు కోర్టును ఆశ్రయించడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు క్లియరెన్స్ లభించలేదు. అయితే ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకొని ఇళ్లు నిర్మించుకునే వారికి మాత్రం కొంత వెసులుబాటు కల్పించడంతో ఆ అవకాశాన్ని అడపాదడపా కొందరు వినియోగించుకుంటున్నారు. కోర్టు తీర్పునకు లోబడి ఉంటామంటూ అఫిడవిట్ దాఖలు చేయడంతో పాటు 14శాతం ఫీజు చెల్లించిన వారికి ప్రభుత్వం ఇళ్లకు అనుమతి ఇస్తోంది. హౌసింగ్ లోన్ తీసుకునే వారు విధిగా ఇంటి నిర్మాణానికి సంబంధించిన అనుమతి పత్రాన్ని సమర్పించాల్సి ఉండడంతో అలాంటి వారు 14శాతం ఎల్‌ఆర్‌ఎస్ చార్జీలు చెల్లించి అనుమతి తీసుకుంటున్నారు. ఇక 14శాతం పన్నులు చెల్లించలేని వారికి ఫీజు మొత్తాలను చెల్లించి దరఖాస్తులను క్లియర్ చేసుకోవాలని సూచించినప్పటికీ చాలా మంది దరఖాస్తుదారులు ముందుకు రావడం లేదు. గత డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్లియర్ చేయడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం రావడంతోపాటు దరఖాస్తుదా రులకు మేలు జరుగుతుందని ఆలోచించి రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే పెనాల్టీలు లేకుండా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్లియర్ చేయాలని ప్రతిపక్షపార్టీలు డిమాండ్ చేసినప్పటికీ ప్రభుత్వం ఫీజుమాఫీ విషయంలో ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. దీనితో ఈసారైనా దరఖాస్తుదారులు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులు చెల్లించి ఇళ్ల నిర్మాణాలకు అనుమ తులు తీసుకుంటారో లేదోనన్న చర్చ జరుగుతోంది. ఒకవేళ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు క్లియర్ అయితే కోట్ల రూపాయల ఆదాయం నగరపాలక సంస్థకు వస్తుందని భావిస్తున్నారు.

జిల్లాలోని హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి, కొత్తపల్లి మున్సిపాలిటీలతో పాటుగా శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ పరిధిలో కూడా దాదాపు 3 నుంచి 5వేలకుపైగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. మూడునెలల్లో క్రమబద్ధీకరణ పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించి, ఇందుకోసం ప్రతి జిల్లా కలెక్టరేట్లు, స్థానిక సంస్థల కార్యాలయాల్లో సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించింది. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను ముందుగా సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ పరిశీలించి నిబంధనల ఆధారంగా వాటిని వడపోస్తుంది. ఆయా ఆస్తులు నిషేధిత జాబితాలో ఉంటే గుర్తించి దరఖాస్తుదారులకు సమాచారం పంపుతుంది. అలాగే దరఖాస్తుదారులు పూర్తిస్థాయి పత్రాలు ఇవ్వకుంటే వాటిని సమర్పించాలనే సమాచారాన్ని ఇస్తుంది. అనంతరం దరఖాస్తులను రెవెన్యూ, నీటిపారుదల, టౌన్‌ప్లానింగ్, పంచాయతీ అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుంది. రెండో దశలో నిర్ధారిత ఫీజు చెల్లించాల్సిందిగా నోటీసు జారీ చేస్తారు. అలాగే అనర్హత కలిగిన దరఖాస్తులను తిరస్కరిస్తారు. మూడో దశలో దరఖాస్తుదారులు ఫీజు చెల్లించి అవసరమైన పత్రాలను సమర్పిస్తే మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు ఇళ్ల నిర్మాణాలకు అనుమతి ఇస్తారు. అలాగే స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు ఆధ్వర్యంలోని అధికారులు పరిశీలించి లే అవుట్ పర్మిషన్లు జారీ చేస్తారు.



'స్వచ్ఛదనం- పచ్చదనం' విజయవంతం చేయాలి

- 5 నుంచి 9 వరకు శానిటేషన్, ప్లాంటేషన్ నిర్వహించాలి
- ప్రభుత్వ కార్యాలయాల్లో రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ చేపట్టాలి : కలెక్టర్

కరీంనగర్‌టౌన్,ఆగస్టు 2: జిల్లాలో 'స్వచ్ఛదనం- పచ్చదనం' విజయవంతం చేయాలని, ప్రతి నెల 3వ శనివారం కార్యక్రమంల నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమ నిర్వహణపై మండలంలోని అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా ప్రతి మండల, గ్రామపంచాయతీ వారీగా టీంలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, వారు ప్రభుత్వం సూచించిన మేరకు స్పష్టమైన ప్రణాళికతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 5వ తేదీకి ముందుగానే కార్యక్రమ ఉద్దేశ్యాన్ని, వివరాలు తెలియజేసేలా ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు మొదలగు ప్రభుత్వ భవనాల గోడలపై పెయింటింగ్ చేయించాలన్నారు. శనివారం పాఠశాల, కళాశాల విద్యార్థులతో వ్యాసరచన పోటీలను నిర్వహించాలని గెలుపొందిన వారికి బహుమతులను అందించాలన్నారు. ఎక్కడ కూడా నీరు నిలువ లేకుండా చూడాలని, తడి పొడి చెత్తను సేకరించి సెగ్రిగేషన్ షెడ్‌కి తరలించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో నిమ్మ, కరివేపాకు, బొప్పాయి, మునగచెట్లను నాటాలని సూచించారు. ఇంటింటికీ మొక్కలు పంచడంతో పాటు వారితో ఆ మొక్కలను నాటించాలన్నారు. 5వ తేదీ నుంచి 9 వరకు నిర్వహించే కార్యక్రమాలలో ప్రతిరోజు శానిటేషన్, ప్లాంటేషన్ కార్యక్రమాలు జర గాలని, ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు వంటి వాటిని మనం వాడకుండా మిగిలిన వారందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. అదేవిధంగా కార్యక్రమాన్ని నిర్వహించే ప్రతిచోట స్వయం సహాయ బృందాలు తయారు చేసిన తినుబండారాలు, ఇతర ఉత్పత్తులతో స్టాళ్లను ఏర్పాటు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనేలా చూడాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో రెయిన్ హార్వెస్టింగ్ చేపట్టాలన్నారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు గుంతలను సక్రమంగా తీసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్డీఓ శ్రీధర్, కరీంనగర్ ఆర్డీఓ మహేశ్వర్, సిపిఓ కొమురయ్య, జడ్పీ సీఈఓ శ్రీనివాస్, డిపిఓ శ్రీనివాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



రామకృష్ణ కాలనీలో జరిగిన కార్యక్రమంలో చిన్నారిని ముద్దాడుతున్న కలెక్టర్

ప్రతి మహిళా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలి

తిమ్మాపూర్: ప్రతి మహిళా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. రామకృష్ణకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా భివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పిల్లలకు పౌష్టికాహారం అందిస్తోందన్నారు. మహిళలు వారి ఆరోగ్యం గురించి, చికిత్సల గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళలు ఆరో గ్యంగా ఉన్నప్పుడే వారి కుటుంబం సంతోషంగా ఉంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా హిమోగ్లోబిన్, బీపీ, బరువు తదితర అంశాలను సరి చూసుకోవాలని, ఏమైనా అనారోగ్య సమస్యలు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ప్రతి మంగళ, గురువారాల్లో మహిళా డాక్టర్ల ద్వారా నిర్వహించే ఆరోగ్య మహిళా కార్యక్రమానికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. పసి పిల్లలకు ముర్రుపాలు మాత్రమే అందిం చాలన్నారు. అనంతరం పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమంలో పాల్గొని, సి-సెక్షన్, తల్లిపాల ప్రాధాన్యం గురించి తెలిపే గోడ ప్రతులను కలెక్టర్ అవిష్కరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి సుజాత, తహసీల్దార్ విజయ్ కుమార్. ఎంపిడివో విజయ్‌కుమార్, మండల వైద్యాధికారి ప్రణావ్, డాక్టర్ జువేరియా, డిసిపిఓ శాంత, సంపత్, సఖి లక్ష్మి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

టీఎస్‌బీపాస్ ఇళ్ల నిర్మాణాల నిబంధనలు సడలించండి

- సీఎంకు మేయర్ సునీల్‌రావు లేఖ

కరీంనగర్ టౌన్, ఆగస్టు 2: ఆగస్టు 26, 2020 తర్వాత ఇళ్లు నిర్మించుకునే వారికి వారి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌తో పాటు లింక్ డాక్యుమెంట్ ఉండాలనే నిబంధనలతో చాలా మంది పహాణీతో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఇంటి నిర్మాణాలకు అనుమతి రాక ఇళ్లు కట్టుకోలేక పోతున్నారని, ఈ నిబంధనను సడ లించాలని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. గత బీఆర్‌ఎస్ ప్రభు త్వం టీఎస్‌బీపాస్ ద్వారా ఇళ్ల నిర్మాణాలకు అనుమతి ఇస్తూ ఈ నిబంధన విధించిందని, దీనితో చాలా మంది ప్లాట్ యజమానులు ఇబ్బందులు పడుతు న్నారని పేర్కొన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థలో శివారులోని ఎనిమిది గ్రామాలు పద్మనగర్, రేకుర్తి, సీతారాంపూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్, సదాశివపల్లి, అల్గునూర్‌లను 2018లో ఆనాటి ప్రభుత్వం విలీనం చేసిందని చెప్పారు. అప్పటికే ఆయా గ్రామ పంచాయతీ పరిధి నగరానికి దగ్గరగా ఉండడంతో చాలా మంది అక్కడ వ్యవసాయ ప్లాట్లను కొనుగోలు చేశారని, అలాంటి వారికి లింక్ డాక్యుమెంట్లు లేకపోవడంతో టీఎస్‌బీపాస్ నుంచి ఇంటి అనుమతి లభించడం లేదని చెప్పారు. తప్పని పరిస్థితిలో ఆయా గ్రామాల్లో కొంత మంది అనుమతి లేకుండా ఇళ్లను నిర్మించుకుంటున్నారని, దీనితో నగరపాలక సంస్థ ఆదాయానికి గండి పడుతోందని, అలాగే ఆ ప్లాట్లలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతి రాదని తెలుసుకొని ఆయా ప్లాట్లను కొనుగోలు చేయకపోవడంతో ప్లాటు యజమానులు ఇటు ఇళ్లు కట్టుకోలేక, అటు వాటిని అవసరాలకు అమ్ముకోలేక ఇబ్బందులు పడుతు న్నారని తెలిపారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఉన్న వారికి లింక్ డాక్యుమెంట్‌తో పనిలేకుండా అనుమతి ఇచ్చే విధంగా చర్యలు తీసుకో వాలని మేయర్ కోరారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- జిల్లా ఆసుపత్రి కార్మికుల నిరసన



జిల్లా ఆసుపత్రి ఎదుట సమ్మె చేపట్టిన కార్మికులు

సుభాష్‌నగర్, ఆగస్టు 2: వైద్యాధికారులు, కాంట్రాక్టు యాజమాన్యం నిర్లక్ష్యం వీడి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టీయూసీసీ జాతీయ సభ్యుడు, ప్రభుత్వ ఆసుపత్రి వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బండారి శేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా ఆసుపత్రి కార్మికులు సమ్మె చేప ట్టారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లా డుతూ అధి కారులు, కాంట్రాక్టు యాజ మాన్యం నిర్లక్ష్యం కారణంగానే సాని టేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్స్ కార్మికులు సమ్మె చేయాల్సి వచ్చిందన్నారు. రెండు నెలలుగా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు, ఫిర్యాదులు చేసినా పెడచెవిన పెట్టారని విమర్శించారు. కార్మికులంటే అధికారులకు, కాంట్రాక్టర్‌లకు చిన్నచూపని ఆరోపించారు. తక్షణమే కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు మూడు నెలల పెండింగ్ జీతాలు ఇవ్వాలని, ఈపీఎఫ్ డబ్బులు కార్మికుల ఖాతాలో జమ చేయాలని, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని, కార్మికులందరికీ ఐడీ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల గురించి అడిగితే కార్మికులను సూపర్‌వైజర్లు వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. జిల్లా ఆసుపత్రికి బడ్జెట్ వచ్చినా కార్మికుల వేతనాలు పెండింగ్‌లో ఉన్నా యని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 5వ తేదీలోగా జీతాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరి ష్కారం అయ్యేంత వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. కార్మికుల సమ్మెకు ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యుగేందర్ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పి ఆరుణ్, కార్యదర్శి టి కళావతి, ఉపాధ్యక్షురాలు శారద, సరళ, రేఖ, సతీష్, సాయి, అరుణ్, దివ్య, జ్యోతి, అంజలి, లత తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతోపాటు బీసీ గణన చేపట్టాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణతో పాటు, బీసీ గణన చేపట్టాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ ఆయా రాష్ట్రాల పరిధిలోకి వస్తుందని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడాన్ని సీపీఐ పార్టీ పక్షాన స్వాగతిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎస్సీ వర్గీకరణతోపాటు బీసీ గణన చేపట్టాలన్నారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ఏపీ పునర్విభజన చట్టానికి సంబంధించి 29 రాష్ట్రాల్లో రాజధాని లేనిరాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని అందుకే నిధులు ఎక్కువ కేటాయించామని చెప్పారన్నారు. విభజన హామీల చట్టం ప్రకారం తెలంగాణలో వెనుకబడ్డ జిల్లాలకు ఆర్థికసాయం ఎందుకు అందించడం లేదన్నారు. వెనుకబడ్డ ప్రాంతాలను ఆదుకోవడంలో బీజేపీ పూర్తిగా విఫలమైందన్నారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, ఇరిగేషన్ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందన్నారు. సింగరేణిని ప్రైవేటీకరణ చేస్తున్నారని, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాత్రం ప్రైవేట్‌పరం చేయడం లేదని చెబుతూ ప్రజలను మోసగిస్తున్నారన్నారు. విభజన హామీలు అమలు చేయకుండా కేంద్రం రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలన్నారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం సీపీఐ అనేక పోరాటాలు చేసిందన్నారు. గౌరవెల్లి ప్రాజెక్ట్‌కు 437 కోట్ల రూపాయలు కేటాయించడం హర్షించదగిన విషయమన్నారు. కానీ గండిపెల్లి ప్రాజెక్టుకు నిధులు కేటాయించలేదన్నారు. ప్యాకేజీ-3ఇందుర్తి నుంచి భీమదేవరపల్లి వెళ్లే కెనాల్‌కు 250 కోట్ల రూపాయలు అవసరమని వెంటనే నిధులు కేటాయించాలన్నారు. ధరణి పోర్టల్‌లో లొసుగుల వల్ల భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. గత ప్రభుత్వం లోని కొందరు నాయకులు యథేచ్ఛగా భూములను మింగారని ఆరోపించారు. చింత కుంటలో 2500 మందికి ఇళ్లు వచ్చాయని, రానున్న కాలంలో ప్రతి పేదవాడికి ఇంటి కల నెరవే రేందుకు సీపీఐ ఆధ్వర్యంలో భూములను ఆక్రమించి పేదలకు పంచుతామన్నారు. ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలన్నారు. సమా వేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు తది తరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టియనా
- జిల్లా అధికారులతో వీడియోకాన్ఫరెన్స్

సుభాష్‌నగర్, ఆగస్టు 2: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టియానా సూచించారు. శుక్రవారం హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్‌వి కర్ణన్, హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవినాయక్ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండడంతో పాటు, పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీరు ఉంటే దోమలు గుడ్లు పెడతాయని, లార్వా ఉత్పత్తి జరిగి, దోమలు పెరిగి డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయన్నారు. కొబ్బరి చిప్పలు, కుండలు, ప్లాస్టిక్ బకెట్లు, కూలర్లు, పూల కుండీలు, టైరు లాంటి వాటిలో నీరు నిలువ ఉంచరాదన్నారు. వీటిని ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. నీరు నిలువ ఉండకుండా చేయడం వల్ల దోమలను నియంత్రించవచ్చ న్నారు. దోమలు కుట్టకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల విషజ్వరాలు రాకుండా చర్యలు తీసుకోవచ్చన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు అయిల్ బాల్స్, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో మురికి కాలువల్లో దోమల లార్వాలను అరికట్టేందుకు టిమాపాస్ మందును స్ప్రే చేయాలని ఆదేశించారు. నీరు నిలువ ఉన్న ప్రాంతాల్లో గంబుజియా చేపలను వదలాలని ఆదేశించారు. ఇతర శాఖల సమన్వయంతో గ్రామాల్లోని ఆరోగ్య సిబ్బంది ద్వారా ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి, వ్యక్తిగత పరిశుభ్రత, ఇంటి పరిసరాలు, ఆరోగ్య విద్య ద్వారా అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, టీవీవీపీ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణప్రసాద్, డాక్టర్ నవీన, డాక్టర్ ఉమాశ్రీ, కైక, ఎండి ఖాలిక్, ఐడీఎస్‌పీ, డీడీఎం తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

WANTED
★ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 20k. Phone : 8977639662 / 8977639663
AJH-4211

RENT/LEASE
★ అల్గునూర్‌లో పరమిత ఐరిస్ వరల్డ్ స్కూలు యొక్క కాంపౌండ్ గోడను ఆనుకొని 30 గుంటల కమర్షియల్ ల్యాండ్ కిరాయికు లేదా లీజుకు ఇవ్వబడును. Ph:9390978999/7702388808
AJH-446

RENT/LEASE
★ అల్గునూర్ గ్రామములో కేంద్రీయ విద్యాలయం దగ్గర 30 ఫీట్ల రోడ్డుకు 25 గుంటల భూమిని కిరాయికు లేదా లీజుకు ఇవ్వబడును. Ph:9390978999 / 7702388808
AJH-447

3+2 స్కీం కలదు

TO-LET
★ కరీంనగర్ నుండి పెద్దపల్లికి పోయేటప్పుడు 100 ఫీట్ల తోవకు బొమ్మకల్ ఫ్లై ఓవర్ దగ్గర, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపుకు ఎదురుగా గల బిల్డింగ్‌లో కింద షట్టర్ మరియు పైన 2BHK ఫ్యామిలీ పోర్షన్ కిరాయికి ఇవ్వబడును. Ph:9390978999 / 7702388808
AJH-445

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి
కరీంనగర్ :- సెల్ : 99854 10640
జగిత్యాల :- సెల్ : 99854 11262
మెట్‌పల్లి :- సెల్ : 70131 42966
వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063
పెద్దపల్లి :- 95509 00238



ఏడుగురిపై వరకట్నం కేసు నమోదు

జమ్మికుంట, ఆగస్టు 2: భర్త తరుపు కుటుంబీకులు అదనపు వరకట్నం కోసం వేదిస్తున్నారని బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. జమ్మికుంటకు చెందిన రమ్యకు హైదరాబాద్‌కు చెందిన కొల్లోజు శ్రీనివాసచారితో 2010 సంవత్సరంలో వివాహం జరిగింది. వివాహ సమయంలో కట్న కానుకల కింద తమ పుట్టింటి వారు రూ.2.50లక్షల నగదు, పది తులాల బంగారు ఆభరణాలు ముట్ట చెప్పారు. వారికి ఒక కుమారుడు జన్మించాడు. కొంత కాలం తర్వాత అత్తింటి వారి నుంచి వేధింపులు మొదలయ్యాయి. భర్త శ్రీనివాసచారి, మామ ఆంద్రయ్య, అత్త సుశీల, బావ సత్యనారాయణ, తోటి కోడళ్ల మమత, నిత్య, మరిది దేవేందర్‌లు అదనపు వరకట్నం కోసం వేధించారని బాధితురాలు రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

గంభీరావుపేటలో దొంగతనం



ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

గంభీరావుపేట, ఆగస్టు 2 :మండల కేంద్రంలోని దుద్దెడి విజయ ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. బీరువా పగుల గొట్టి రెండు తులాలన్నర బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి ఎత్తు కెళ్లారు. విజయ అత్తమ్మ ఇటీవల అనారోగ్యంతో చనిపోయింది. ఇల్లు వీడాలని చెప్పడంతో విజయ కుటుంబం వేరే ఇంట్లో అద్దెకు ఉంటోంది. ప్రతీ రోజు ఉదయం సొంతింటికి వచ్చి ఇంటి పనులు చేసి తిరిగి అద్దె ఇంటికి వెళ్తోంది. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళాలు పగుల గొట్టి ఉంది. బీరువా తెరిచి, వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. పోలీస్‌లకు సమాచారం అందించడంతో ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్, ఎస్సై రాంమోహన్ పరిశీలించారు. డాగ్ స్కాడ్ టీం బృందం ఇంటి పరిసరాలను పరిశీలించింది.





















ఎస్‌యూ డిగ్రీ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఆగస్టు 2: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్, జూన్, 2024లో (రెగ్యులర్, బ్యాక్‌లాగ్) నిర్వహించిన 2, 4, 6వ సెమిస్టర్ల పరీక్షల ఫలితాలను శుక్రవారం శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వీ శ్రీరంగ ప్రసాద్ విడుదల చేశారు. ఈ ఫలితాలు www.satavahana.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గొల్లపల్లి, ఆగస్టు 2: గొల్లపల్లి మండలం దమ్మన్నపేట గ్రామంలో గత నెల కూల్ డ్రింక్ అనుకుని ప్రమాదవశాత్తు గడ్డి మందు తాగిన బొలిశెట్టి ప్రభాకర్ (39) పదకొండు రోజుల అనంతరం పరిస్థితి విషమించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గత నెల 22న రాజు శ్రీనివాస్ అనే రైతు పొలంలో వరి నారు లాగేందుకు ప్రభాకర్ వెళ్లాడు. మధ్యాహ్నం వేళలో ఒడ్డు పై ఉన్న థమ్సప్ బాటిల్‌లో పొరపాటున కూల్ డ్రింక్ అనుకుని ప్రమాదవశాత్తు గడ్డి మందు తాగాడు. గమనించిన తోటి స్నేహితులు హుటాహుటిన వైద్య చికిత్సల నిమిత్తం ప్రైవేట్ వాహనంలో జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యుడి సూచన మేరకు కరీంనగర్ ఆసుపత్రికి తరలించి అక్కడ రెండు రోజుల పాటు వైద్యచికిత్సలు చేయించారు. అయితే, అక్కడి వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు చేయిస్తున్నారు. అయితే, పదకొండు రోజులు అనంతరం పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య శిరీష, పాప, బాబు ఉన్నారు. మృతుడి తల్లి బొలిశెట్టి లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.







గండాలు దాటనున్న గౌరవెల్లి


గౌరవెల్లి రిజర్వాయర్

● రిజర్వాయర్ పెండింగ్ పనుల పూర్తికి కేబినెట్ ఆమోదం

● రూ.437 కోట్ల విడుదలకు నిర్ణయం ● 17 ఏళ్ల కల సాకారమవుతోందని రైతుల సంతోషం

హుస్నాబాద్, ఆగస్టు 2: మెట్ట ప్రాంత వరప్రదాయిని గౌరవెల్లి రిజర్వాయర్ గండాలు ఇక తొలగిపోనున్నాయి. ఇక్కడి పొలాల్లో గోదావరి జలసవ్వడులను చూడాలనే ఈ ప్రాంత రైతాంగ నిరీక్షణ ఫలించబోతుంది. 17 ఏళ్ల క్రితం నుంచి ఈ రిజర్వాయర్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దాదాపు రిజర్వాయర్ పనులు పూర్తయి నీటిని నింపే అవకాశం ఉన్నా వ్యవసాయ భూములకు నీరందించే కాలువలు లేక.. రిజర్వాయర్ ముంపు బాధితుల సమస్యలు పరిష్కరించకపోవడంతో పెండింగ్‌లోనే ఉంటూ వస్తున్నది. ఈ క్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఎన్నికల్లో గెలిచిన వెంటనే రిజర్వాయర్‌ను పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. అందులో భాగంగా గురువారం జరిగిన రాష్ట్ర కేబినెట్ గౌరవెల్లి రిజర్వాయర్ పెండింగ్ పనుల పూర్తికి సవరించిన అంచనా ప్రతిపాదనల ప్రకారం రూ.437 కోట్లు కేటాయిస్తూ ఆమోదం తెలిపింది. ఇక గౌరవెల్లి రిజర్వాయర్ పనులు శరవేగంగా జరుగుతాయని రైతులు సంతోషపడుతున్నారు.

2007లో శంకుస్థాపన

వర్షాధారంపై ఆధారపడి వ్యవసాయం సాగించే మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్, హుజూరాబాద్ నియోజకవర్గాలతో పాటు వరంగల్ జిల్లాలోని పలు గ్రామాలకు సాగు నీరందించాలని శ్రీరాంసాగర్ ఇందిరమ్మ వరదకాలువ గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్ల నిర్మాణానికి 2007 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హుస్నాబాద్‌లో శంకుస్థాపన చేశారు. ఒప్పందం ప్రకారం ఈ రిజర్వాయర్ల పనులు ఐదేళ్లలో పూర్తి చేయాల్సి ఉండగా రీ డిజైన్ ఇతర కారణాలతో 17 ఏళ్లుగా పనులు జరుగుతూనే ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం కేసీఆర్ ఈ రిజర్వాయర్‌ను సందర్శించి దీనిని రీడిజైన్ చేశారు. 1.4 టీఎంసీలు ఉన్న గౌరవెల్లి రిజర్వాయర్ ను 8.23 టీఎంసీలకు పెంచారు. దీంతో అదనంగా భూసేకరణ చేయాల్సి వచ్చింది. ఎలాంటి అనుమతులు లేకుండా రి జర్వాయర్ ఎత్తుపెంచారని నిర్వాసితులు జాతీయ హరిత ట్రై బ్యునల్‌ను ఆశ్రయించారు. ఇప్పటికీ కూడా ఎన్‌జీటీలో ఈ కేసు ఉంది.


రిజర్వాయర్‌లోకి వస్తున్న నీరు(ఫైల్)

పూర్తయిన ట్రయల్ రన్

8.23 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లోకి 2 వేల క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసే 32 మెగావాట్ల సామర్థ్యం ఉన్న చైనా నుంచి వచ్చిన మూడు మోటార్లను బిగించారు. 2022 జూలై 31వ తేదీన అందులోని ఒక మోటార్‌తో 10 నిమిషాల పాటు ట్రయల్ రన్ నిర్వహించారు. మరో రెండు రోజుల అనంతరం అధికారులు రెండో మోటారు, మరో రెండు రోజులకు మూడో మోటారు ట్రయల్‌రన్ చేశారు. గౌరవెల్లి రిజర్వాయర్‌లోకి నీటిని మిడ్‌మానేరు ద్వారా బెజ్జంకి మండలం తోటపల్లి ఆన్‌లైన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి గౌరవెల్లి రిజర్వాయర్‌లోకి తీసుకవస్తారు. మొదటి డిజైన్ ప్రకారం రూ.409 కోట్లతో చేపట్టిన ఈ సొరంగం పనులు పూర్తయిన అనంతరం రీ డిజైన్‌లో భాగంగా అదనంగా మరో రూ.380 కోట్లతో పనులు చేశారు. తోటపల్లి ఆన్‌లైన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 16 కిలోమీటర్ల దూరంలో రేగొండ వద్ద గౌరవెల్లి రిజర్వాయర్ ఉంటుంది. ఇందులో 12 కిలోమీటర్ల మేర సొరంగం ఉంటుంది. 5.6 మీటర్ల టన్నెల్‌షిప్‌తో 32 క్యూబిక్‌తో నీటిని తీసుకెళ్లే విధంగా సొరంగం నిర్మించారు. 50 మీటర్ల పొడవు, 25 మీటర్ల వెడల్పు, 110 మీటర్ల లోతుతో సర్జ్‌పూల్ (నీళ్ల సంపు), 61మీటర్ల పొడవు, 17 మీటర్ల వెడల్పు, 130 మీటర్ల లోతుతో పంపుహౌజ్‌ను నిర్మాణం చేశారు. ట్రయల్ రన్‌తో రిజర్వాయర్‌లో ఒక టీఎంసీ నీటిని కూడా నింపారు.

1.06 లక్షల ఎకరాలకు సాగు నీరు

గౌరవెల్లి రిజర్వాయర్ పూర్తయితే 1.06 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. హుస్నాబాద్ నియోజకవర్గంలో 57,852 ఎకరాలు, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో 48, 148 ఎకరాలకు సాగునీరందుతుంది. ఈ రిజర్వాయర్‌కు రెండు ప్రధాన కాలువలు ఉండగా కుడి కాలువ ద్వారా 90 వేల ఎకరాలు, ఎడమ కాలువ ద్వారా 16వేల ఎకరాలు సాగవుతాయి.



రాబోయే సీజన్‌లో గౌరవెల్లి ద్వారా నీరందిస్తాం
: మంత్రి పొన్నం ప్రభాకర్

రాబోయే సీజన్‌లోపు గౌరవెల్లి ద్వారా సాగు నీరందిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కాలువలకు సంబంధించి రూ.437 కోట్లు బడ్జెట్‌లో ఆమోదించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇతర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి సీఎం వైఎస్‌ఆర్ శంకుస్థాపన చేశారని, అప్పుడే 80 శాతం పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. కేసీఆర్ సీఎం అయిన తర్వాత కుర్చీ వేసుకొని ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తానని చెప్పి పదేళ్లయినా పట్టించుకోలేదని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్వాసితులపై నిరంకుశత్వంగా వ్యవహరించిందని గుర్తుచేశారు. ఇక కాలువల నిర్మాణం వేగం చేస్తామని చెప్పారు.

వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లు త్వరగా మంజూరు చేస్తున్నాం

టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ గంగాధర్

గణేశ్‌నగర్, ఆగస్టు 2: రైతులకు త్వరగా వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లను మంజూరు చేస్తున్నామని కరీంనగర్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్(ఎస్‌ఈ) వడ్లకొండ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది 689 సర్వీసులను మంజూరు చేయగా, ఈ ఏడాది 937 సర్వీసులను మంజూరు చేశామని తెలిపారు. గత ఏడాదితో పోల్చుకుంటే 248 సర్వీసుల మంజూరు(36 శాతం) పెరిగిందని అన్నారు. సర్వీసుల మంజూరు మొత్తం ఆన్‌లైన్ చేయడం ద్వారా ఎప్పటికప్పుడు దరఖాస్తు ఎక్కడ పెండింగ్ ఉంది, ఎవరి దగ్గర పెండింగ్ ఉంది దానికి గల కారణాలను సవివరంగా అగ్రికల్చర్ పోర్టల్ (ఆన్‌లైన్)లో చూసుకునే వెసులు బాటు ఉందన్నారు. దీని ద్వారా మంజూరులో ఆలస్యం లేకుండా తొందరగా మంజూరు అవుతున్నాయని అన్నారు.

అలాగే ఈ- స్టోర్స్ విధానం ప్రవేశపెట్టడం ద్వారా కావాల్సిన మెటీరియల్‌ను ఆన్‌లైన్ ద్వారా రిజర్వ్ చేసుకొని మెటీరియల్‌ను కావాల్సిన సమయంలో తీసుకొని పనులు ప్రారంభిం చవచ్చన్నారు. పేపర్ పనిలేకుండా ఆన్‌లైన్ ద్వారా మెటీరియల్ తీసుకునే సౌలభ్యం విద్యుత్ శాఖకు, రైతులకు ఎంతో మేలు చేకురుతుందని చెప్పారు. అలాగే ఒక పనికి సంబంధించిన మెటీరి యల్ ఏమైనా మిగిలి ఉంటే వేరే పనికి పేపర్ ట్రాన్సాక్షన్ ద్వారా మార్చుకొనే వెసులు బాటు మొత్తం కూడా ఆన్‌లైన్‌లోనే చేశామని తెలిపారు. ఈ పద్ధతి వలన కూడా ఎంతగానో సమయం ఆదా అవుతుందని వివరించారు. ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యాన్ని కూడా పెంచామని, వంగిన పోల్‌లు, లూస్ లైన్‌లను కూడా సరి చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ అధికారులు రైతులకు మరింత చేరువై వారి సమస్యలను పరిష్కరించే దిశగా పొలం బాట కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. రైతులకు వ్యవసాయ సర్వీసుల మంజూరుకు అన్ని ఏర్పాట్లు చేసుకొని వెనువెంటనే మంజూరు చేసేందుకు ఆహర్నిశలు కృషి చేస్తున్నామని అన్నారు .

విష జ్వరంతో మహిళ మృతి


శ్రీలత (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 2: పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం మొట్లపల్లి గ్రామానికి చెందిన శనిగరపు శ్రీలత (35) విష జ్వరంతో గురువారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల చెప్పిన వివరాల ప్రకారం.. శనిగరపు శ్రీలత ఐదు రోజులుగా జ్వరంతో బాధపడుతూ జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నా తగ్గపోవడంతో హుజూరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా శుక్రవారం మృతిచెందింది. మృతురాలికి భర్త శ్రీనివాస్, ఇద్దరు కుమారులు హర్ష, సూర్య ఉన్నారు.

యువతిపై అత్యాచారయత్నం: కేసు నమోదు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 2: కరీంనగర్‌లో కోతిరాంపూర్‌లో మంచిర్యాల జిల్లాకు చెందిన యువతి (20)పై రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం రామన్నపేటకు చెందిన చింతం వంశీకృష్ణ(21) అత్యాచార యత్నం చేశాడని కరీంనగర్ ఒకటో టాణా పోలీసులు తెలిపారు. కరీంనగర్‌లో డిగ్రీ చదువుతున్న వంశీకృష్ణ కొద్దిరోజుల కిందట యువతితో పరిచయం పెంచుకుని గురువారం ఆమెను కరీంనగర్‌కు రావాలని కోరాడు. ఆమె కరీంనగర్‌కు వచ్చిన సమయంలో అత్యాచారయత్నం చేవాడని బాధితరాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అత్యాచారయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నిందితుడికి 8నెలల జైలు శిక్ష

హుజూరాబాద్, ఆగస్టు 2: ఓ మహిళ ఇంట్లోకి చొరబడి చంపుతానని బెదిరించిన వ్యక్తికి జడ్జి ఎనిమిది నెలల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన ప్రకారం.. ఫిబ్రవరి 2, 2024న హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఓ మహిళ ఇంటి పక్కనే ఉండే బుర్ర చక్రపాణి అకారణంగా ఆమె ఇంట్లోకి చొరబడి కత్తితో చంపుతానంటూ తల వెంట్రుకలు పట్టుకొని బెదిరించాడు. దీంతో మహిళ హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని విచారణ జరిపి, కోర్టులో చార్జిషీటు వేశారు. కోర్టులో ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం జడ్జి శ్రీసాయిపద్మ నిందితుడికి 8 నెలల జైలు శిక్షతో పాటు రూ.300జరిమానా విధించారు.

నిందితుడి అరెస్టు

ఇల్లంతకుంట, ఆగస్టు 2: మండలంలోని జంగమరెడ్డిపల్లె గ్రామ కమాన్ వద్ద సిద్దిపేటకు చెందిన వల్లెపు దేవదాస్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. అనంతగిరికి చెందిన గొల్లపల్లి రమేష్ ద్విచక్రవాహనం గురువారం చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశాడని పేర్కొన్నారు. శుక్రవారం వాహనాల తనిఖీ చేస్తుండగా దేవదాస్‌ను పట్టుకున్నట్లు, అతడిపై సిద్దిపేటలో రెండు కేసులు ఉన్నట్లు తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్ట్

మేడిపల్లి, ఆగస్టు 2: మేడిపల్లి గ్రామ శివారులో గంజాయి విక్రయిస్తున్న మ్యా కల శేఖర్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కమ్మరిపెల్లి మండలం కోనరావుపేట గ్రామానికి చెందిన శేఖర్ వ్యక్తి కిరాణం నడుపుతూ జీవనం సాగిస్తుండేవాడు. అత్యాశతో అధిక డబ్బు సంపాదించాలనే మొజులో పడి తక్కువ ధరకు గంజాయిని విక్రయించి ఎక్కువ ధరకు యువతకు విక్రయించాలని మేడిపల్లి, కొండాపూర్ పరిసరాల్లోని యుతనుకు గంజాయి అమ్మేందుకు వచ్చాడు. ఈ సమాచారం పోలీసులకు అందడంతో ఎస్పీ ఆదేశాల మేరకు దాడి చేసి అతడిని పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 565 కిలోగ్రాముల గంజాయి మోటర్‌సైకిల్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు, కోరుట్ల సీఐ సురేష్ బా బు, ఎస్సై శ్యామ్‌రాజ్, సిబ్బంది దినేష్, అనిల్, చందు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


సురేశ్‌గౌడ్ మృతదేహం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 2: మండలంలోని నారాయణపూర్‌కు చెందిన యువకుడు లింగాల సురేశ్‌గౌడ్ (28) మండల కేంద్రం శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారి పక్కన శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపారు. గ్రామంలోని సురేశ్‌గౌడ్ ఉపాధి నిమిత్తం కొలంగా మహారాష్ట్రకు వలస వెళ్తుండేవాడు. ఈ నెల 1న స్వగ్రామానికి చేరుకున్నాడు. శుక్రవారం ఉదయం తన ద్విచక్రవాహనంపై గొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట వైపునకు వస్తున్న క్రమంలో కింద పడిపోయి చనిపోయాడు. సమాచారం అందుకున్న ఎస్సై రమాకాంత్ పరిశీలించారు. గుండెపోటుతో మృతి చెందడా..? లేక వాహనం ఢీకొనడంతో చనిపోయడా.. అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి తల్లి ఎల్లవ్వ, భార్య స్వాతి, కూతురు రితన్యా, అన్విత్ లు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

అప్పుల బాధతో గొర్రెల కాపరి ఆత్మహత్య


రాజయ్య మృతదేహం

రామడుగు, ఆగస్టు 2: అప్పుల బాధతో ఓ గొర్రెల కాపరి ఆత్మహత్య చేసుకున్న ఘటన దేశరాజుపల్లిలో విషాదం నింపింది. ఎస్‌ఐ సురేందర్ కథనం ప్రకారం.. దేశ రాజుపల్లి గ్రామానికి చెందిన అమరగొండ రాజయ్య (53) గొర్లను మేపకుంటూ జీవిస్తున్నాడు. కుటుంబ పోషణలో భాగంగా అప్పుల పాలయ్యాడు. అప్పులు తీరే మార్గం కనిపించకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన రాజయ్య గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన గ్రామస్థులు 108 వాహనంలో కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య కనకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేందర్ తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

జమ్మికుంట, ఆగస్టు 2: పాత పగలు మనసులో పెట్టుకుని తనతో పాటు భార్య, కుమారుడిపై ఓ కుటుంబం దాడి చేసిందని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీస్‌లు వారిపై కేసు నమోదు చేశారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన రేవెల్లి సమ్మయ్య, భార్య కనకమ్మ, కుమారుడు రాజేష్‌లపై తిరుపతి, స్వరూప, ప్రకాష్, సింధు, అరవింద్ అనే వ్యక్తులు పాత పగలు మనసులో పెట్టుకుని తమపై దాడి చేశారని బాధితుడు సమ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య


స్రవంతి (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 2: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో కడుపునొప్పి భరించలేక సకినాల స్రవంతి(28) అనే వివాహిత ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన స్రవంతికి నారాయణపూర్‌కు చెందిన సకినాల దేవరాజుతో పదేళ్ల కిందట వివాహమైంది. ఆ దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. ఏడాది కిందట దేవరాజు ఉపాధి నిమిత్తం దుబాయి వలస వెళ్లాడు. కొంత కాలంగా స్రవంతి అనారోగ్యంతో బాధ పడుతోంది. గురువారం రాత్రి తాను కడుపునొప్పికి తాళలేకపోతున్నానని తండ్రి శంకరయ్యకు ఫోన్ చేసి చెప్పింది. తండ్రి రాత్రి నారాయణపూర్ చేరుకొని అడుగ గా కడుపునొప్పి భరించలేక ఎలుకల మందు తాగానని తెలిపింది. దీంతో ఆమెను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందింది. మృతురాలి తండ్రి శంకరయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమాకాంత్ తెలిపారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న నీటి విడుదల

రామడుగు, ఆగస్టు 2: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశ యానికి ఏడో రోజు నీటి విడుదల కొనసాగుతోంది. ప్రస్తుతం నాలుగు పంపుల ద్వారా 12,600 ఎస్‌ఆర్‌ఆర్ మిడ్ మానేరు డ్యాంలోనికి తరలిస్తున్నారు. నీటి ప్రవాహంతో వరదకాలువ ఉప్పొంగుతూ ప్రవహిస్తుండటంతో రైతుల్లో సంతోషం వ్యక్తం అవుతోంది. వివిధ గ్రామాల ప్రజలు వరద కాలువ, గ్రావిటీ కాలువల నీటి ప్రవాహాన్ని తిలకిస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న ఎత్తిపోతలు

బోయినపల్లి: మండలంలోని మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 12,600 క్యూ సెక్కులు, మానేరు, మూలవాగు ద్వారా 1890 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 311. 080 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.50 టీఎంసీలకు 10.018 టీఎంసీల మేర నిల్వ ఉంది.

శ్రీపాద ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 4 మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం 9 గంటల వరకు ప్రాజెక్టులోకి ఎగు వ ప్రాంతం నుంచి 7924 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.554 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.



గాయత్రి పంప్‌హౌస్ నుంచి వస్తున్న నీరు

రూ. 2.27 కోట్ల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల మంజూరు

- మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్ అర్బన్/తిమ్మాపూర్ ఆగస్టు 2: ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) కింద మానకొండూర్ నియోజకవర్గానికి రెండో విడతగా 2 కోట్ల 27 లక్షల 82 వేల రూపాయలు మంజూరైనట్టు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. తొలి విడతలో నియోజకవర్గానికి 295 మందికి 56 లక్షల 74 వేల రూపాయలు మంజూరు కాగా, రెండో విడతలో 992 మందికి 2 కోట్ల 27 లక్షల 82 వేలతో ఇప్పటి వరకు మొత్తం 2,84,56,000 రూపాయలు చెక్కుల రూపంలో మంజూరైనట్టు ఎమ్మెల్యే వివరించారు. మానకొండూర్ మండలంలో 249 మందికి 53,17,000 రూపాయలు, శంకరపట్నంలో 175 మందికి 39,73,500 రూపాయలు, తిమ్మాపూర్ మండలంలో 178 మందికి 39,51,500 రూపాయలు, గన్నేరువరం మండలంలో 76 మందికి 15,79,500 రూపాయలు, బెజ్జంకి మండలంలో 94 మందికి 24,52,500 రూపాయలు, ఇల్లంతకుంట మండలంలో 160 మందికి 37,99,500 రూపాయల విలువ చేసే చెక్‌లు మంజూరయ్యాయని తెలిపారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మండలాల వారీగా పంపిణీ చేస్తామని, అందరికీ సమాచారం అందించే ప్రక్రియను క్యాంపు కార్యాలయం ద్వారా చేపట్టినట్టు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు.

ఐవీవై స్కూల్‌లో స్టూడెంట్ కౌన్సిల్ వేడుకలు



విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

భగత్‌నగర్, ఆగస్టు 2: నగరంలోని సీతారాంపూర్ ఐవీవై స్కూల్‌లో స్టూడెంట్ కౌన్సిల్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఐవీవై పాఠశాలలో ఇన్వెస్టిచర్ (విద్యార్థి కౌన్సిల్) వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఐవీవై స్కూల్ చైర్మన్ పసుల మహేష్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌కు స్టూడెంట్ కౌన్సిల్ పునాది లాంటిదన్నారు. విద్యార్థుల వ్యక్తిత్వం, కమ్యూనికేషన్ విద్యావేత్తలు, క్రీడా పరీక్షల ద్వారా ఎంపిక చేయబడ్డారన్నారు. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అవలంబించుకోవాలన్నారు. నాయకత్వ లక్షణాలతో భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదుగుతారన్నారు. దేశ భవిష్యత్తు విద్యార్థి దశ నుండే రూపుదిద్దుకుంటుందన్నారు. పాఠశాల కౌన్సిల్‌లో ఆద్య వరేణ్య, కె తన్విత ఎంపిక య్యారు. కార్యక్రమంలో పాఠశాల కో-చైర్మన్, సిద్ధార్థ పాఠశాలల చైర్మన్ శ్రీపాల్ రెడ్డి, పాఠశాల డైరెక్టర్ పసుల జయశ్రీ, ప్రిన్సిపాల్ డాలి రత్నాని పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, ఆగస్టు2: నగరంలో చెట్ల కొమ్మలు తొలిగింపులో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్, టు, ఏడీఈ సాయినేని నరేందర్, సుధీర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సప్తగిరి కాలనీ, శ్రీనగర్ కాలనీ, భగత్‌నగర్, గోదాం గడ్డ, కిసాన్ నగర్, మంచిర్యాల్ చౌరస్తా, సివిల్ హాస్పిటల్ వెనుక వైపు, రాజా టాకీస్ రోడ్, భూమ్‌రెడ్డి హాస్పిటల్ రోడ్, ఖాన్ పుర, దుర్గమ్మగడ్డ, కిసాన్‌నగర్, మైత్రీ కన్వెన్షన్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మానసిక వికలాంగుల పాఠశాలకు విరాళం



చెక్కును అందజేస్తున్న పోల్ సత్యనారాయణ

కరీంనగర్ టౌన్, ఆగస్టు 2: నగరంలోని మనోవికాస్ మానసిక వికలాంగుల పాఠశాలకు నగరానికి చెందిన విద్యార్థి బుక్‌బ్యాంకు యజమాని పోల్ సత్యనారాయణగురుస్వామి రూ.30వేల విరాళాన్ని అందించారు. శుక్రవారం ఆయన పాఠశాలలను సందర్శించి అక్కడ మానసిక వికలాంగులైన విద్యార్థుల ను చూసి చలించిన ఆయన ఒక అబ్బాయిని దత్తత తీసుకొని సంవత్సరం ఆ అబ్బాయి రవాణా, ఇతర చార్జీల కింద రూ.30వేల విరాళాన్ని చెక్ రూపంలో పాఠశాలను నిర్వహిస్తున్న తల్లిదండ్రుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చీటి రామారావు, కోశాధికారి పరమేశ్వర్‌కు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల టీచర్లు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

హుజూరాబాద్ తహసీల్దార్‌గా కనకయ్య



హుజూరాబాద్, ఆగస్టు 2: హుజూరాబాద్ తహసీల్దార్‌గా కనకయ్య శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ విజయ్ కుమార్ సాధారణ బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో తిమ్మాపూర్ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న కనకయ్యను హుజూరాబాద్ తహసీల్దార్‌గా బదిలీ చేశారు. ఈ మేరకు బాధ్యతలు చేపట్టగా రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్ కనకయ్యకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

తిమ్మాపూర్ తహసీల్దార్‌గా విజయ్‌కుమార్

తిమ్మాపూర్, ఆగస్టు2: తిమ్మాపూర్ తహసీల్దార్‌గా విజయ్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా ఉన్న కనకయ్య హుజూరాబాద్‌కు బదిలీపై వెళ్లగా హుజురాబాద్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన విజయ్‌కుమార్ తిమ్మాపూర్‌కు బదిలీ వచ్చారు.

హుజూరాబాద్ టౌన్ సీఐగా తిరుమల్



హుజూరాబాద్, ఆగస్టు 2: హుజూరాబాద్ టౌన్ సీఐగా జి తిరుమల్ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పనిచేసిన బొల్లం రమేష్ కరీంనగర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కరీంనగర్ సీసీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న తిరుమల్‌ను హుజూరాబాద్ టౌన్ సీఐగా నియమించారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించగా, సిబ్బంది స్వాగతం పలికారు.

చల్లూరులో ఆర్టీసీ కార్గో సేవలు ప్రారంభం

వీణవంక,ఆగస్టు2: మండలంలోని చల్లూరు మీ సేవ కేంద్రంలో ఆర్టీసీ కార్గో సేవలను ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్గో మేనేజర్ వి రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీ కార్గో సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, అన్ని పట్టణ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాలకు తక్కువ చార్జీలతో పార్సిల్స్ వేగంగా రవాణా చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు రాజు, అన్వేష్, చంద్రమొగిలి, ఎలుబాక నరేష్, పూదరి రమేష్,దూలం సురేష్,పల్లెర్ల కిరణ్,వేణు,మార్త రాజేష్ తదితరులు ఉన్నారు.

'హౌసింగ్‌బోర్డు కాలనీపై ఎమ్మెల్యేకు పట్టింపు లేదు'

జమ్మికుంట, ఆగస్టు 2: జమ్మికుంట పట్టణ పరిధిలోని హౌసింగ్‌బోర్డు కాలనీ వాసులు వరద కాల్వ నిర్మాణం కోసం కళ్లలో ఒత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నారని, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాత్రం ఇక్కడి దుస్థితిని పట్టించుకోవడం లేదని కౌన్సిలర్ శ్రీపతి నరేష్ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కమలాపూర్‌లో బస్టాండ్, షాపింగ్ కాంప్లెక్స్ కోసం రూ.2కోట్లు నిధులు కేటాయించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇచ్చాడని, అదే సమయంలో వరదల్లో పలుమార్లు మూడు వందల ఇండ్లు మునిగిపోయిన హౌసింగ్‌బోర్డు సంఘటన గుర్తుకు రాకపోవడం బాధాకరం అన్నారు.

సీఎంకు ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, ఆగస్టు2: కాంగ్రెస్ పార్టీ మాదిగ సామాజికవర్గ నాయకులతో కలిసి మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హైదారాబాద్‌లో అసెంబ్లీ ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డిని శుక్రవారం కలిసి ఘనంగా సన్మానించి ధన్యవాదములు తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు ధర్మాసనం దానికి అనుబంధంగా మాదిగ వర్గీకరణ తెలంగాణ ప్రభుత్వం స్వాగతించడంతో పాటు ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్లలో నూతన రిజర్వేషన్‌లను అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించినందుకు ఆయన కలసి ధన్యవాదములు తెలిపినట్లు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు.

సుప్రీంకోర్టు తీర్పుతో మాదిగల బతుకుల్లో వెలుగు

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్



క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సుభాష్‌నగర్, ఆగస్టు 2: తరతరాలుగా సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రగతికి దూరమై నలిగిపోయిన మాదిగ బతుకుల్లో సుప్రీం కోర్టు తీర్పు వెలుగులు నింపిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ అన్నారు. శుక్రవారం స్థానిక కార్ఖానగడ్డలోని గాంధీ విగ్రహం వద్ద నాయకుడు సంపతి అశోక్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు మాదిగల చిరకాల ఆకాంక్ష నెరవేరిందన్నారు. అనంతరం మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, సుబా మాజీ డైరెక్టర్ కామారపు శ్యాం, మాజీ కార్పోరేటర్ లంక రవీందర్, అంబేద్కర్ స్టడీ సెంటర్ బండ శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

● ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీ కోర్టు తీర్పు చారిత్రాత్మకమని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ చిర్ర ప్రవీణ్, కనకం వంశీ అన్నారు. కోర్టు చౌరస్తాలో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిసున్నామని తెలిపారు.

భగత్‌నగర్: ఎస్సీ ఉపకులాల వర్గీకరణ సమస్యపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగిస్తున్నామని భారత్ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై గతంలో బీకేఎంయూ మద్దతు ప్రకటించిందని తెలిపారు.

హుజూరాబాద్: ఎస్సీ కులాలను కుల గణన చేసి వర్గీకరణ అమలు చేయాలని ఎస్సీ ఉపకులాల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వేణు అన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడాన్ని హర్షిస్తూ శుక్రవారం హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజేష్, లింగయ్య, అంజి, సతీష్‌వర్మ, వెంకటేష్, జాన్, సాయికుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

జమ్మికుంట: సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకమని మాదిగ లాయర్స్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొలుగూరి సదయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. న్యాయవాదులు కన్నం దేవయ్య, అంద శ్రీనివాసరావు, రమేష్, మట్టెల తిరుపతి, బత్తుల తిరుపతి, ప్రభాకర్, సుమిత్ర, విక్రమ్ పాల్గొన్నారు.

● మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో దొగ్గల భాస్కర్, బోయిని అంకూస్, సారయ్య పాల్గొన్నారు.

తిమ్మాపూర్: ఎస్సీ కులాల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ అలుగునూర్ కూడలి వద్ద మాదిగ, మాదిగ ఉప కులాల సంఘ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సిరిసిల్ల శంకర్, మాతంగి లక్ష్మణ్, కొమురయ్య, అనిల్ కుమార్, నర్సయ్య, మల్లేశం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చొప్పదండి: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సదానందం, అంబేద్కర్ సంఘం పట్టణ అధ్యక్షుడు పెద్దెల్లి శ్రీనివాస్, నాయకులు కొత్తూరి మహేశ్, నరేశ్, రాజేశ్వరి, అరవింద్, ప్రభాకర్, సురేశ్, రత్నం, డేవిడ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై హర్షం వ్యక్తం స్వీట్లను పంపిణీ చేశారు.

ఈవోగా 'నాగారపు' బాధ్యతల స్వీకరణ

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 2: నగరంలోని జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయ ఈవోగా నాగారపు శ్రీనివాస్ శుక్రవారం ఆలయంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో గట్టుదుద్దెనపల్లి ఆలయ ఈవో ఎండపెల్లి మారుతి, సిబ్బంది కొండయ్య, అర్చకులు చవిటి రామశర్మ, మెంగార పు కార్తీక్‌శర్మ పాల్గొన్నారు.

ఈవోకు టీఎన్‌జీవో నాయకుల సన్మానం

సుభాష్‌నగర్ ఆగస్టు 2: నగరంలోని జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన నాగారపు శ్రీనివాస్‌ను శుక్రవారం టీఎన్‌జీవో కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు, అసోసియేట్ ప్రెసిడెంట్ రాగి శ్రీనివాస్, ప్రభాకర్, రవీందర్, హర్మీందర్‌సింగ్ పాల్గొన్నారు.

తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్పు ప్రతిపాదన సరికాదు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 2: హైదరాబాద్‌లో గల పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును మార్చేందుకు అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం శోచనీయమని పొట్టి శ్రీరాములు ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల రామేశం ఒక ప్రకటనలో ఖండించారు. విశ్వవిద్యాలయం పేరు మార్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదన చేయడం చాలా బాధాకరమన్నారు. తీర్మానాన్ని వెనక్కి తీసుకునే వరకు పోరాటం చేయాలని వైశ్యులకు విజ్ఞప్తి చేశారు.

చిరుద్యోగులకు రుణ మాఫీ వర్తింపచేయాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 2: చాలీచాలని జీతాలతో జీవితాన్ని వెల్లదీస్తున్న చిరుద్యోగులైన ఎన్జీవోలకు, నాలుగో తరగతి ఉద్యోగులకు రైతు రుణమాఫీ వర్తింపచేయాలని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మీనారాయణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక టీఎన్‌జీవో భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో నిత్యావసర సరుకుల ధరలు విపరీ తంగా పెరిగిపోయి తలకు మించిన భారం పడుతోం ద న్నారు. చాలీచాలని జీతాలతో జీవితాన్ని వెల్లదీస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు కూడా రైతు రుణమాఫీ వర్తింపచేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పట్టణ అధ్యక్ష కార్యదర్శులు సర్దార్ హర్మీందర్ సింగ్ సుమంత్ రావు, రూరల్ అధ్యక్ష కార్యదర్శులు రాజేష్ భరద్వాజ్ నేరెళ్ల కిషన్ పాల్గొన్నారు.

పలువురు పంచాయతీ కార్యదర్శుల బదిలీ

కరీంనగర్ రూరల్, ఆగస్టు 2: కరీంనగర్ మండలంలో పలు గ్రామాల్లో కార్యదర్శులు బదిలీ చేస్తూ కలెక్టర్ పమేలా సత్పతి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మండలంలోని జూబ్లీనగర్ పంచాయతీ కార్యదర్శి ఎం. కిరణ్‌కుమార్‌ను మానకొండూర్ మండలం వెల్దికి, నగునూర్ కార్యదర్శి పి మల్లయ్యను గంగాధర మండలం తాడి జెర్రి గ్రామానికి, ఎలబోతారం కార్యదర్శి డి. కవితను కొత్తపల్లి మండలం నాగుల మల్యాలకు బదిలీ చేశారు. బహాదూర్‌ఖాన్‌పేట కార్యదర్శి జి లావణ్యను గంగాధర మండలం నాగిరెడ్డి పూర్‌కు, మొగ్దుంపూర్ కార్యదర్శి సల్మాన్‌ఖాన్‌ను చొప్పదండి మండలం పెద్దకుర్మపల్లికి, చెర్లబూత్కూర్ కార్యదర్శి అబ్దుల్ వాహేద్‌ను చొప్పదండి మండలం భూపాలపట్నానికి బదిలీ అయ్యారు. నల్లగుంటపల్లి కార్యదర్శి సుమన్‌ను శంకరపట్నం మండలం కరీంపేటకు, ఫకీర్‌పేట కార్యదర్శి సప్నను గంగాధర మండలం కొండన్నపల్లి, ఇరుకుల్ల గ్రామ కార్యదర్శిగా పని చేస్తున్న అనిల్ కుమార్‌ను చొప్పదండి మండలం రాగంపేటకు బదిలీ చేశారు.

● మండలానికి కొత్త కార్యదర్శులు..

బదిలీల్లో భాగంగా కరీంనగర్ మండలానికి తొమ్మిది మంది కార్యదర్శులను కొత్తగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మొగ్దుంపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా కె శ్రావణి, ఫకీర్‌పేట కార్యదర్శిగా బి దేవిక, ఎలబోతారానికి ఎస్ జ్యోతి, నగునూర్‌కు పి లచ్చయ్య, చెర్లబూత్కూర్‌కు గ్రామానికి డి వెంకటేశ్వర్‌రావు, ఇరుకుల్ల గ్రామానికి ఎం సంతోష్, నల్లగుంటపల్లికి కె మల్లికార్జున్, బహదూర్‌ఖాన్ పేటకు ఎస్ కవిత, జూబ్లీనగర్‌కు జి రమాదేవిని నియమించారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం'ను పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఆర్డీవో కె మహేశ్వర్

కరీంనగర్ రూరల్, ఆగస్టు 2: స్వచ్ఛదనం-ప చ్చదనం కార్యక్రమాన్ని ఈనెల 5నుంచి 9వ తేది వరకు అన్ని గ్రామాల్లో పకడ్బందీగా నిర్వహిం చాలని ఆర్డీవో కె మహేశ్వర్ కోరారు. శుక్రవారం కరీంనగర్ మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమ నిర్వహణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ఆర్డీవో ముఖ్యఅతిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చే యాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తహసీ ల్దార్ రాజు, ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం భార్గవ్, మండల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.

శంకరపట్నం: స్వచ్ఛదనం... పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి నాగార్జున అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీడీవో కృష్ణప్రసాద్ స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులు, వీవోలతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమ నిర్వాహణకు గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు, వీవోలతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. మురుగు నీటిని నిల్వ, చెత్త చెదారం లేకుండా స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఏవో శ్రీనివాస్, ఎంపీవో బషీరుద్దీన్, ఏపీవో శారద ఉన్నారు.

శిశువుకు ముర్రుపాలు తాగించాలి



జమ్మికుంట మండలంలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 2: బిడ్డ ప్రసవించిన గంటలోపు శిశువుకు ముర్రుపాలు తాగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్ అరుణ తల్లులకు సూచించారు. నగరంలోని పద్మనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభలో తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని, ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే తాగించాలని సూచించారు.కార్యక్రమంలో ఏఎన్‌ఎం ఉమారాణి, అంగన్‌వాడీ టీచర్ ఎ సరిత, గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు కృష్ణవేణి హాజరయ్యారు.

● స్థానిక 50వ డివిజన్ గణేశ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను కార్పొరేటర్ కొలిపాక అంజయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తల్లిపాల విశిష్టతను, ఆవశ్యకతను చిన్నపిల్లల తల్లులకు, గర్భిణులకు వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కిషోర్‌కుమార్, ఎఎన్‌ఎం సుప్రియ, అంగన్‌వాడీ టీచర్ పద్మ, తల్లులు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

● గణేశ్‌నగర్: అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వాహించారు.రాంనగర్ 37వ డివిజన్ అంగన్‌వాడీ కేంద్రంలో, 33 డివిజన్‌గల కాశ్మీర్‌గడ్డ అంగన్‌వాడీ సెంటర్‌లో, కిసాన్‌నగర్ సెక్టార్‌లోని దుర్గమ్మ గడ్డ అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

● కరీంనగర్ రూరల్: మండలంలోని చామనపల్లిలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైద్యులు డాక్టర్ మనోహర్, డాక్టర్ మధుకర్‌రెడ్డి హాజరై తల్లి పాల శ్రేష్టతను వివరించారు.

● తిమ్మాపూర్: అలుగునూర్ కాకతీయ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు, శుక్రవారం సభ నిర్వహించారు. ఈ కార్యమానికి 8వ డివిజన్ కార్పొరేటర్ సల్ల శారద రవీందర్, ఏఎన్‌ఎంలు హాజరయ్యారు.

● జమ్మికుంట రూరల్: జమ్మికుంట మండలం శంభునపల్లి, కోరపల్లి, మడిపల్లి గ్రామాల్లోని ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలో అంగన్వాడి కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు.

సైదాపూర్: ఆకునూర్‌లోని అంగన్‌వాడీ రెండవ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ కె రజిత, ఏఎన్‌ఎమ్ శ్యామల ఉన్నారు.

సంక్షేమ హాస్టల్‌ల తనిఖీ

చిగురుమామిడి,అగస్టు 2: మండల కేంద్రంలోని పలు హాస్టళ్లను శుక్రవారం జిల్లా ట్రైనీ కలెక్టరు అజయ్‌యాదవ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు పరిశుభ్రతను పాటించాలన్నారు. తహశీల్దార్ ముద్దసాని రమేష్, ఎంపీవో శ్రావణ్‌కుమార్, ఎంపిడివో ఎండి ఖజా మోయినోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళను కిడ్నాప్ చేసిన వ్యక్తులపై కేసు

వీణవంక,ఆగస్టు2: మహిళను కిడ్నాప్ చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. మండలంలోని చల్లూరులో బీసీ కాలనీకి చెందిన శివరాత్రి అక్షయ అదే గ్రామానికి చెందిన కొంచెం సంతోష్‌ను ప్రేమవివాహం చేసుకొన్నారు. వీరి ప్రేమ వివాహం ఇష్టం లేని అక్షయ తల్లి శివరాత్రి గంగాజమున మరో నలుగురు శివరాత్రి శంకర్, పల్లెపు రాజు,రజిత,శివరాత్రి రాజలింగంతో కలిసి శుక్రవారం సంతోష్ ఇంటికి వచ్చి తలుపులు పగులకొట్టి ఇంట్లో చొరబడి అక్షయను కారులో ఎత్తుకెళ్లారు. అడ్డుకున్న సంతోష్ తల్లిని రాడ్డుతో చేతులపై కొట్టి భయభ్రాంతులకు గురిచేసినట్లు సంతోష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఎస్ఐ తోట తిరుపతి వారిని పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి అక్షయను సంతోష్‌కు అప్పగించినట్టు తెలిపారు.

మాజీ సర్పంచ్‌లకు రావాల్సిన బిల్లులు చెల్లించాలి



హైదరాబాద్‌లో చిగురుమామిడి మండల సర్పంచ్‌లు

చిగురుమామిడి, ఆగస్టు 2: ఐదు సంవత్సరాల కాలం గ్రామాల్లో సర్పంచ్‌లుగా ఉండి ప్రజలకు సేవలు అందించిన తమకు రావాల్సిన బిల్లులను వెంటనే చెల్లించాలని సర్పంచ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల మాజీ సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు జక్కుల రవీందర్ మాట్లాడుతూ శుక్రవారం రాష్ట్రకమిటీ పిలుపు మేరకు తమ బిల్లుల కోసం హైదరాబాద్‌లోని ప్రజాభవన్ ముందు నిరసన చేపట్టేందుకు వెళ్లిన మాజీ సర్పంచ్‌లను అక్రమంగా అరెస్టు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సన్నీల్ల వేంకటేశం, గోళి బాపురెడ్డి పాల్గొన్నారు.

● ఇల్లందకుంట: మండలంలోని మల్యాల, వంతడుపుల, సిరిసేడు, ఇల్లందకుంట గ్రామాల్లోని మాజీ సర్పంచ్‌లను పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్టు చేశారు. బిల్లుల చెల్లింపుల కోసం నిరసన కార్యక్రమానికి హైదరాబాద్‌కు బయలుదేరడానికి సిద్ధంగా ఉన్న సర్పంచ్‌లు కంది దిలీప్, రాఫీఖాన్, సాంబయ్య, సురేందర్‌రెడ్డిలను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

● వీణవంక: అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్నారన సమాచారంతో మండలంలోని మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో మాజీ సర్పంచ్‌లు పోతుల నర్సయ్య, కుమార్, పాదిల రమేష్, జున్నుతుల మాల్లారెడ్డి తదితరులున్నారు.

● గన్నేరువరం: మండలంలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచులు పుల్లెల లక్ష్మి, గంప మల్లీశ్వరి వెంకన్న, తీగల మోహన్‌రెడ్డి తదితరులను అరెస్టు చేశారు.

జిల్లాలో 47 మంది మాజీ సర్పంచ్‌ల అరెస్టు

కరీంనగర్ క్రైం : పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ జేఏసీ పిలుపుతో అసెంబ్లీ ముట్టడికి వెళుతున్నారనే కారణంగా జిల్లాలోని 47 మం ది మాజీ సర్పంచ్‌లను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. భారత్ న్యాయ్ సురక్షా సంహిత(బీఎన్‌ఎస్‌ఎస్) సెక్షన్ 170 కింద సర్పంచ్‌లను అరెస్టు చేశారు.

'బీఆర్‌ఎస్ హయాంలో కోట్ల రూపాయల భూములు కబ్జా'

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 2: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కరీంనగర్‌లో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ, ప్రైవేటు భూములు కబ్జాకు గురయ్యాయని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. బీఆర్‌ఎస్ హయాంలో నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి పేదల భూములను సైతం వదలలేదని పేర్కొన్నారు. కరీంనగర్ శివారు ప్రాం తాల్లో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములతో పాటు పేదల భూములు కబ్జా చేశారని ఆరోపించారు. ధరణి పేరిట వందలాది వ్యవసాయ భూములను కాజేశారన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్, మేయర్ సునీ ల్‌రావులకు ఈ కబ్జాలు కనపడ లేదా అని ప్రశ్నించారు. రేకుర్తిలో పేదముస్లింల ఇళ్లను ధ్వంసం చేశారని పేర్కొన్నారు.

'పారమిత'లో నమూనా ఎన్నికలు

భగత్‌నగర్, ఆగస్టు 2: నగరంలోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలలో శుక్రవారంనమూనా ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో హెడ్ బాయ్, హెడ్ గర్ల్, క్రీడా రంగానికి, సాంస్కృతిక రంగానికి లీడర్లను ఇ-బ్యాలెట్ విధా నంలో ఓటు హక్కును వినియోగించుకుని ఎన్నుకున్నారు. పారమిత పాఠశాలల చైర్మన్ ప్రసాదరావు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, అనూకర్‌రావు, రాకేష్, వియుఎంప్రసాద్, రమణ, వినోద్‌రావు, హన్మంతరావు, ప్రొగ్రాం హెడ్ గోపికృష్ణ, కో-ఆర్డినేటర్లు నాగరాజు, రాము, సిబ్బంది పాల్గొన్నారు.

'అల్ఫోర్స్' విద్యార్థుల ప్రతిభ

భగత్‌నగర్, ఆగస్టు 2: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల విద్యార్థులు సిల్వర్ జోన్ ఇంటర్నేషనల్ ఇన్ఫర్మాటిక్స్‌లో బంగారు, ఎక్సలెన్స్ పతకాలు గెలుచుకున్నారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్ఫోర్స్ విద్యార్థులకు అంతర్జాతీయ ఇన్ఫర్మెటిక్స్ ఒలంపియాడ్‌లో బంగారు, రజత, కాంస్య పతకాలు రావడం అభినందనీయమన్నారు. ఇటీవల నిర్వహించిన సిల్వర్‌జోన్ అంతర్జాతీయ ఇన్ఫర్మెటిక్స్‌లో పాఠశాలకు చెందిన జి జోయల్డేవిన్, క్రిష్ణచైతన్య, మనీష్, అనిరుధ్, వర్షిత్, శ్లోక, సర్వేశ్, ధ్రువ్‌శర్మ, వి అభిరామ్, క్రిష్ణప్రతీక్‌రెడ్డి, ఎం ఓంతేజ ఉత్తమ ప్రతిభ చాటారన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గన్నారు.

బిర్లా స్కూల్లో బటర్ ఫ్లై డే వేడుకలు

కరీంనగర్ రూరల్, ఆగస్టు 2: మండలంలోని బొమ్మకల్‌లో గల బిర్లా స్కూల్‌లో కిండర్ గార్డెన్‌లో బటర్ ఫ్లై వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు బటర్ ఫ్లై వేషధారణలతో అలరించారు. ఈ సందర్భంగా జంతువులకు సంబంధించిన పప్పెట్ షో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బబిత విశ్వనాథన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు జిల్లా కేంద్రంలో కరాటే పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 2: జిల్లా కేంద్రంలోని రాజశ్రీ గార్డెన్స్‌లో జీఆర్‌ఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఆగస్టు 4న గౌరు నారాయణరెడ్డి మెమోరియల్ జాతీయ కరాటే ఓపెన్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు గౌరు రాజిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో వివిధ రాష్ట్రాల నుంచి 900 మంది విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. వీటిలో కాటా, కుమిటి, టీం కటాస్, వెపన్ కటా విభాగాలలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కుమిటీ విభాగంలో గ్రాండ్ చాంపియన్‌షిప్ సాధించిన వారికి నగదు బహుమతి అందించనున్నట్లు తెలిపారు.

జమ్మికుంట మార్కెట్ కార్యదర్శిగా మల్లేశం

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా ఆర్ మల్లేశం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నిన్నటి వరకు ఇక్కడ ఉన్నతశ్రేణి కార్యదర్శిగా పనిచేసిన గూగులోతురెడ్డి నర్సంపేట మార్కెట్‌కు బదిలీ అయ్యారు. హుజూర్‌నగర్ మార్కెట్‌లో పనిచేసిన మల్లేశం ఇక్కడకు బదిలీపై వచ్చారు. నూతంగా బాధ్యతలు స్వీకరించిన కార్యదర్శిని మాజీ జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు బచ్చు భాస్కర్, వ్యాపారులు కలిశారు.

రేషన్ బియ్యం పట్టివేత

మానకొండూర్, ఆగస్టు 2: అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం మానకొండూర్‌లో పట్టుకున్నట్లు స్థానిక సీఐ సదన్‌కుమార్ తెలిపారు. సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి గ్రామానికి చెందిన మానుపర్తి జయశంకర్ అనే వ్యక్తి రేషన్ బియ్యాన్ని వ్యాన్‌లో తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

● సంక్షిప్త సమాచారం..

● కరీంనగర్ రూరల్: తహసీల్దార్‌గా విధుల్లో చేరిన సీహెచ్ రాజును, ఆర్ఐ కనకరాజును మండల రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు. నాయబ్ తహసీల్దార్ శంకర్, ఆర్ఐ వాస్తవిక్, డీలర్ల సంఘం అధ్యక్షుడు పూర్ణచందర్, ప్రతినిధులు పాల్గొన్నారు.

- కరీంనగర్ రూరల్ మండలంలోని చేగుర్తి గ్రామ కార్యదర్శి బర్ల రాజు బదిలీపై వెళ్తున్న సందర్భంగా గ్రామపంచాయతీ పాలకవర్గ మాజీసభ్యులు సన్మానించారు.

● శంకరపట్నం: కేశవపట్నం గ్రామానికి చెందిన మేకల కొంరయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బాధితుడిని నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించి, రూ.1.50లక్షల ఎల్వోసీ అందజేశారు.

● శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం ట్రాలీ ఆటో డ్రైవర్లకు సైబర్ నేరాలపై హెడ్ కానిస్టేబుల్ రామచంద్రం శుక్రవారం అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

● సైదాపూర్: గౌరవెల్లి ప్రాజెక్టుకు రూ. 431.50కోట్ల నిధుల మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలుపడంతో హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి క్షీరాభిశేకం చేశారు.

● రామడుగు : గోపాలరావుపేట అల్ఫోర్స్ పాఠశాలలో ఆషాఢమాస బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు.

●గంగాధర: ఉపాధ్యాయులు తమ విధి నిర్వహణలో బదిలీలు సర్వసాధారణమని, పనిచేసే చోట నిబద్ధతతో విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈవో వేణుకుమార్ అన్నారు. శుక్రవారం బూరుగుపల్లిలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మణ్‌కుమార్, అశోక్, శ్యాంసుందర్‌లు బదిలీపై వెళ్లగా పాఠశాలలో సన్మానించారు.

● చిగురుమామిడి: మండలంలోని గునుకులపల్లి, ఇందుర్తి గ్రామాల్లో వివిధ కారణాలతో మృతి చెందిన మృతుల కుటుంబ సభ్యులను శక్రవారం సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంటకరెడ్డి పరామర్శించారు.

- గీతా కార్మికుల సమస్యల సాధనకు చేపట్టిన గీతన్న చైతన్యయాత్ర పోస్టర్‌ను కల్లు గీతా కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి తిరుపతిగౌడ్ ఆవిష్కరించారు.

● మానకొండూర్: మండలంలోని పెద్దూరుపల్లి, మానకొండూర్, శ్రీనివాస్‌నగర్ గ్రామాలకు చెందిన గంగినేని మల్లమ్మ, గొల్ల సంతోష్, బొజ్జ లింగయ్యలు ఇటీవల మృతి చెందగా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు జీవి రామకృష్ణారావు మృతుల కుటుంబాలను పరామర్శించారు.

● మానకొండూర్: మంత్రివర్గంలో మహిళలకు అవకాశం ఇవ్వకుండా అవమాన పరిచింది బీఆర్‌ఎస్ పార్టీయేనని డీసీసీ ప్రధాన కార్యదర్శి తాల్లపల్లి సంపత్‌గౌడ్ ఆరోపించారు. మానకొండూర్‌లో ఆయన మాట్లాడారు.